క్లుప్తంగా

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 35, క్యాబేజీ 15, ఫ్రెంచ్ బీన్స్ 75–115, క్యారెట్ 38, దొండ 18–23, చిక్కుడు 60, గోకర 45, బీట్‌రూట్ 25, క్యాప్సికం 40, ఆలు 20, దోస 15, సొర 7, పొట్ల 13, ఉల్లి 14 చామగడ్డ 35. మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

బ్రాహ్మణులకు నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం డివిజన్‌లోని మహాత్మా గాంధీ లా కళాశాలలో దేప ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కళాశాలలో సోమవారం గంగుల జయమ్మ వర్ధంతి సందర్భంగా దేప ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ లా కళాశాల సెక్రటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి, దేప ఫౌండేషన్ చైర్మన్ దేప భాస్కర్‌రెడ్డిలు బ్రాహ్మణులకు బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసరాలు అందజేసి వారిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో గంగుల విష్ణువర్ధన్‌రెడ్డి కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్ల వితరణ



ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న షాలోం టెంపుల్ ప్రతినిధి

మలక్‌పేట: షాలోం టెంపుల్ మలక్‌పేట ఆధ్వర్యంలో పేదలకు ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, చాదర్‌ఘాట్, ప్రాంతాల్లో సోమవారం ఆహార ప్యాకెట్లు అందజేసినట్లు పాస్టర్ డాక్టర్ పి. సాలోమన్ జోబ్స్ తెలిపారు. నగరంలోని స్లమ్ ఏరియాలలో, ఫుట్‌పాత్‌లపై నివాసం ఉండే వారికి రోజుకు వంద మందికి ఒకపూట నాణ్యమైన ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాలు ఇంకా విస్తృత పరుస్తామన్నారు.

కూరగాయల మార్కెట్‌ను శుభ్రం చేయండి

హుడాకాంప్లెక్స్: ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నా మార్కెట్ అధికారులు, కాంట్రాక్టర్ స్పందించకపోవడం సరికాదని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. సోమవారం ఆయన ఎన్టీఆర్‌నగర్‌లోని కూరగాయల మార్కెట్‌ను ఆర్‌కే పురం డివిజన్ కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూరగాయల వ్యర్థాల నుంచి దుర్వాసన రావడంతో పాటు అంటురోగాలు వ్యాపిస్తున్నా పట్టించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సదరు కాంట్రాక్టర్ ప్రతీ రోజు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ కన్వీనర్ ధీరజ్‌రెడ్డి, నాయకులు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప కల్యాణం



బీరప్ప కల్యాణంలో పాల్గొన్న మేయర్ పారిజాత, కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని మల్లాపూర్‌లో సోమవారం బీరప్ప కల్యాణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సబితారెడ్డి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సబితా రెడ్డి మాట్లాడుతూ.. బీరప్ప ఆశీర్వాదంతో ప్రజలు చల్లగా ఉండాలని వేడుకున్నానన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు మంత్రిని ఘనంగా సన్మానించారు. మేయర్ పారిజాత, అందెల శ్రీరాములు కల్యాణ ఉత్సవాల్లో పాల్గొని ఒగ్గు పూజారుల దీవెనలు తీసుకున్నారు. ఈ ఉత్సవాల్లో కార్పొరేటర్లు భారతమ్మ, రోహిణి, ప్రభాకర్‌రెడ్డి, మనోహర్, సుదర్శన్‌రెడ్డి, సంతోషి, మహేశ్వరి, బాలాపూర్ ఖల్సా సహకార సొసైటీ ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, మాధవరెడ్డి, మాజీ కౌన్సిలర్ గణేశ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మారెడ్డి, రామిడి రాంరెడ్డి, జైహింద్‌కుమార్, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, ఐలమ్మ, నరహరిగౌడ్, విక్రం, వెంకటేశ్, గోపాల్ పాల్గొన్నారు.

అధికారులూ పట్టించుకోరేం!

- రోడ్డుపై మురుగునీటి కుంట
- రాకపోకలకు ఇబ్బంది
- దుర్గంధం, దోమలతో స్థానికుల అవస్థలు



సాగర్ ఎన్‌క్లేవ్‌లో రోడ్డుపై పారుతున్న మురుగు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల్లో డ్రైనేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ పరిధిలోని హస్తినాపురం, వనస్థలిపురం, చంపాపేట, లింగోజిగూడ తదితర డివిజన్లలోని పలు కాలనీల్లో మురుగు సమస్య తీవ్రంగా ఉంది. ఇక చినుకు పడితే చాలు పరిస్థితి మరీ అధ్వానంగా తయారవుతోంది. డ్రైనేజీలు పొంగుతూ మురుగు నీరు రోడ్లపై ఏరులైపారుతోంది.

- హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలోని ప్రధాన రోడ్డులో నెలకొన్న పరిస్థితే ఇందుకు నిదర్శనం.
- కొన్ని నెలలుగా రోడ్డుపై నిత్యం మురుగు పారుతుండటంతో పెద్ద గుంట ఏర్పడింది.
- దీంతో ఈ మార్గంలో వెళ్లే ద్విచక్రవాహనదారులు, ముఖ్యంగా పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ కంపుతో పాటు దోమలు పెరిగిపోయి ఇళ్లలో ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.
- ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని వివిధ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

కనీస వసతులు కల్పించాలి



హస్తినాపురం డివిజన్‌లోని చాలా ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సాగర్ ఎన్‌క్లేవ్ కాలనీలో కొన్ని నెలలుగా డ్రైనేజీ పొంగిపొర్లుతూ రోడ్లపై మురుగు ఏరులై పారుతున్నా.. జలమండలి అధికారులు గానీ, స్థానిక ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకోవడంలేదు. వెంటనే సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీతోపాటు, నందనవనం కాలనీలో కనీస వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ సాదం ఐలయ్య, నందనవనం కాలనీ

హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని వినతి



రాహుల్ బొజ్జకు వినతి పత్రం అందజేస్తున్న మహేష్, వెంకటేష్

మలక్‌పేట: శిథిలావస్థలో ఉన్న కాచిగూడ బాయ్స్ హాస్టల్ కాంప్లెక్స్, ముషీరాబాద్ గర్ల్స్ హాస్టల్ కాంప్లెక్స్‌కు నూతన భవనాలు నిర్మించాలని తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్, గ్రేటర్ అధ్యక్షుడు నక్క వెంకటేష్ కోరారు. ఈ మేరకు వారు సోమవారం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జను కలిసి వినతి పత్రం అందజేశారు. 2019లో హైదరాబాద్ జిల్లా కలెక్టర్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఈ రెండు హాస్టల్ భవనాలను సందర్శించి మరమ్మతులు లేదా నూతన భవనాల ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక అందజేశారని వినతి పత్రంలో పేర్కొన్నారు. శిథిలమైన హాస్టల్ భవనాలను కూల్చివేసి కొత్త భవనాలు నిర్మించాలని 2020 నవంబర్‌లో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు.ఈ విషయాన్ని పలు దఫాలుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా భవనాలు నిర్మాణానికి నోచుకోలేదని సెక్రటరీకి తెలియజేశారు. నిధులు మంజూరు చేసి నూతన భవనాలు నిర్మించి దళిత విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకుడు మేడి నాగరాజు ఉన్నారు.

క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేయాలి



మొక్కను నాటిన డైరెక్టర్ జనరల్ రాజు తదితరులు

లింగోజిగూడ: క్రమశిక్షణ, అంకిత భావంతో పని చేసి దేశానికి పేరు తీసుకురావాలని జీఎస్‌ఐ డీజీ డాక్టర్ ఎస్.రాజు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది భూ శాస్త్రవేతలకు సోమవారం నాగోలు బండ్లగూడలోని జీఎస్‌ఐలో శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జీఎస్‌ఐ డైరెక్టర్ జనరల్ రాజు మాట్లాడుతూ, ఆత్మగౌరవాన్ని, సంపూర్ణ నైపుణ్యాన్ని కాపాడుకోవాలని, దేశ అభివృద్ధికి దోహదపడే ఖనిజ నిక్షేపాల అన్వేషణకు తమ వంతు కృషి చేయాలని సూచించారు.శిక్షణ తరగతుల్లో కొత్త విషయాలను నేర్చుకొని ఆచరణలో పెట్టాలన్నారు. ఈ సందర్భంగా జీఎస్‌ఐ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏడీజీ ఎంఎం పవర్, డీడీజీలు వెంకటేశ్వరరావు, మాథ్యుజోసెఫ్, జీఎస్‌ఐటీఐ డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా కాంగ్రెస్



బీమా చెక్కును అందజేస్తున్న రాంరెడ్డి

చైతన్యపురి: ప్రతి కార్యకర్త కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎల్‌బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. కొన్ని రోజుల క్రితం మృతి చెందిన చంపాపేట డివిజన్‌కు చెందిన కార్యకర్త ఖాజాపాషా కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరఫున రూ.2 లక్షల బీమా చెక్కును ఆయన అందజేశారు. ఇతర పార్టీల్లో కార్యకర్తలను పట్టించుకోని పరిస్థితి ఉండగా.. కాంగ్రెస్ పార్టీ అందుకు భిన్నంగా సభ్యత్వం ఉన్న కార్యకర్త చనిపోతే ఆ కుటుంబాలకు అండగా ఉంటోందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు కోట్ల బీమా సొమ్మును పార్టీ అందజేసిందన్నారు. కార్యక్రమంలో చంపాపేట పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు మతిన్‌బాయ్, మసూర్‌అలీ, సునీల్, మసూర్, అలీ, కిరణ్, శివ, వెంకటేష్, యాదగిరి, జంగయ్యగౌడ్, సుజాత పాల్గొన్నారు.

అభివృద్ధికి భారీగా నిధులు



పహాడీషరీఫ్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: సీఎం కేసీఆర్ కృషితో మహేశ్వరం నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి పి.సబితా రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని 6, 8, 28 వార్డుల్లో రూ.66.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులు, 3వ వార్డులో రూ.62 లక్షల వ్యయంతో నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గంలోని రెండు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చిస్తున్నామన్నారు. తాగునీరు, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు నాలాల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, మోడ్రన్ వైకుంఠ ధామాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, నాయకులు కైసర్ బామ్, ఇక్బాల్ ఖలీఫా, షర్ఫుద్దీన్, అబ్దుల్ రవూఫ్, షాకీర్, షేక్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి మంత్రి అభినందనలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కేంద్రంలోని శ్రీగాయత్రి టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థిని షణ్ముఖ ప్రియ ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించారు. సోమవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన మంత్రి సబితారెడ్డి ఆమెను అభినందించారు.

ఘనంగా ఆంజనేయుడి రథోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి ఆర్కేపురం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు. రాత్రి పొద్దుపోయాక స్వామి వారి రథోత్సవం కనుల పండుగా జరిగింది. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, ఆలయ చైర్మన్ జగిని రమేష్ ఈవో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీత్రయోదశ ఆలయాల సంస్థ ట్రస్టీల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు

వనస్థలిపురం: వనస్థలిపురం ద్వారకామయినగర్ కాలనీలోని శ్రీ త్రయోదశ ఆలయాల సంస్థ ట్రస్ట్ బోర్డుకు నూతనంగా నియమితులైన సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈఓ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ వారితో ప్రమాణం చేయించారు. ట్రస్టీలుగా నక్క ఉమేష్‌కుమార్ (ఎఫ్‌ఎఫ్‌ఎం), కొత్రపాటి లక్ష్మీపతిరావు, బొందుగుల సరళారెడ్డి, సుదెం శేఖర్ సాగర్, నెల్లికొండ సత్యనారాయణగౌడ్, కామిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, భూక్యా విజయ, అర్చకులు బండారు విజయశంకర్ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె.ప్రభులింగం, కార్యదర్శి ఎన్.ప్రవీణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



కల్యాణి | శ్రీరాం, దయానశ్రీ (ఫైల్)

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన తల్లి, ఇద్దరు పిల్లలు అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ప్రకాశం జిల్లా కొనకలమెట్ల మండలం చింతకుంట్ల గ్రామానికి చెందిన రాగిని రామ్మూర్తి, రాగిని కల్యాణి దంపతులు తమ పిల్లలు శ్రీరాం, దయానశ్రీతో కలిసి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రిస్టియన్ కాలనీలోఉంటున్నారు. శనివారం కల్యాణి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కంగారు పడ్డ భర్త రామ్మూర్తి తన భార్యాపిల్లల ఆచూకీ కోసం బంధు, మిత్రుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదన్నపేటలో వృద్ధురాలు...



జకీరా బేగం (ఫైల్)

చంచల్‌గూడ: మతిస్థిమితం సరిగ్గాలేని ఓ వృద్ధురాలు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాని ఘటన సోమవారం మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో జరిగింది. ఎస్‌ఐ సాయికుమార్ కథనం ప్రకారం... కుర్మగూడ డివిజన్ నెహ్రూనగర్‌లో నివాసముంటున్న జకీరా బేగం (52) ఆదివారం ఉదయం ఇంటిని నుంచి బయటకు వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు రోజులపాటు 'కంటి వెలుగు'



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రాంచందర్, భూపాల్‌రెడ్డి

మీర్‌పేట: తెలంగాణ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల కోసమే కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మీర్‌పేట కార్పొరేషన్ 43వ డివిజన్ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ తెలిపారు. సోమవారం జిల్లెలగూడ శ్రీసాయినగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డితో కలిసి రాంచందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శిబిరంలో అన్ని రకాల కంటి పరీక్షలను నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి అద్దాలను పంపిణీ చేస్తారని, నాలుగు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని, స్థానిక డివిజన్ ప్రజలంతా శిబిరంలో పాల్గొని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దాల బాలప్ప, నాయకులు వంటేరు నర్సింహారెడ్డి, మామిడి సుదర్శన్‌రెడ్డి, జ్ఞానేశ్వరచారి, బాలాపూర్ యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలు వైశాలి, సిబ్బంది అజయ్ పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే



సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో నెలకున్న మౌలిక సమస్యలన్నింటినీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా పరిష్కరించి ఇతర నియోజకవర్గాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో రూ.72 లక్షలతో నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘ భవనం, సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘ భవనాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం స్థానిక కార్పొరేటర్ మధుసూదన్ రెడ్డి డివిజన్ బీజేపీ నాయకుడు సుంకరి రమేష్‌గౌడ్‌తో కలిసి హాజరై మరోమారు సంక్షేమ సంఘ భవనాలను ప్రారంభించి సీనియర్ సిటిజన్ల కాలక్షేపం కోసం తన సొంత ఖర్చుతో స్మార్ట్ టీవీ అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నల్లా రఘుమారెడ్డి, ఓరుగంటి వెంకటేశం, సుంకోజు కృష్ణమాచారి, ముద్ద కల్యాణ్, ముడుపు రాజిరెడ్డి, గోపాల్ ముదిరాజ్, నిషికాంత్‌రెడ్డి, అంజిరెడ్డి, శేఖర్ రెడ్డి, తలారి సత్యప్రకాష్, గోకుల సరోజా, రోజా రెడ్డి, వసంత కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు రఘుపతిరెడ్డి, యాదగిరిరెడ్డి, పుల్లారెడ్డి, సాంబశివా రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వాసవి క్లబ్' ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్



సచివాలయనగర్‌లో స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న వాసవి క్లబ్ ప్రతినిధులు

వనస్థలిపురం: వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ102ఏ ఆధ్వర్యంలో సోమవారం వనస్థలిపురం సచివాలయనగర్‌లో క్లబ్ ప్రతినిధులకు స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ రీజియన్ చైర్మన్ అత్తులూరి మల్లికార్జునరావు మాట్లాడుతూ, క్లబ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాలలో స్పోర్ట్స్ మీట్‌లు నిర్వహిస్తామని, వీటిలో విజేతలు ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే ఫైనల్స్‌లో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు విట్టా దూరయ్య, భాస్కర్‌గుప్తా, సచివాలయనగర్ కాలనీ అధ్యక్షుడు కూర్మారావు, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీ వాసులకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులు, కాంట్రాక్టర్లను కోరారు. డివిజన్‌లోని ఎన్‌జీఓఎస్ కాలనీలో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను అధికారులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ భవ్యారెడ్డి పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో సాహిత్‌కు కాంస్య పతకం



సాహిత్‌ను అభినందిస్తున్న కోచ్ ప్రదీప్

మలక్‌పేట: మూసారంబాగ్‌కు చెందిన బీజేవైఎం రాష్ట్ర నేత కొంగర ప్రవీణ్ కుమారుడు కొంగర సాహిత్ స్టేట్ లెవల్ బాక్సింగ్‌లో కాంస్య పతకం సాధించాడు. తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 14 తేదీ వరకు షేక్‌పేట జీహెచ్ఎంసీ స్పోర్ట్ కాంప్లెక్స్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్ (2023) షిప్‌లో 54–57 కేటగిరీలో కాంస్య పతకం సొంతం చేసుకున్నాడని కోచ్ ప్రదీప్ తెలిపారు. పలువురు ప్రముఖులు సాహిత్‌కు అభినందనలు తెలిపారు.

వ్యక్తి ప్రాణం కాపాడిన కానిస్టేబుల్‌కు అభినందనలు



ట్రాఫిక్ కానిస్టేబుల్ సతీష్‌ను అభినందిస్తున్న రాచకొండ సీపీ చౌహాన్

నాగోలు: ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి ప్రాణాన్ని కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ సోమవారం అభినందించారు. వివరాలు... ఎల్‌బీనగర్ ట్రాఫిక్ కానిస్టేబుల్ సతీష్ గత శనివారం విజయవాడ బస్టాప్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. సాయంత్రం ఆరు గంటల సమయంలో జార్ఖండ్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు మాంగ్రా (35) ఆర్థిక సమస్యల నేపథ్యంలో ఎల్బీనగర్ ఫ్లైఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయాడు. ఇది గమనించిన ట్రాఫిక్ కానిస్టేబుల్ సతీష్ అక్కడే ఉన్న ఓ ప్రైవేట్ ఉద్యోగి జాన్సన్ తో కలిసి మాంగ్రను మాటల్లో పెట్టి చాకచక్యంగా కాపాడాడు. వ్యక్తి ప్రాణం కాపాడిన కానిస్టేబుల్ సతీష్‌ను కమిషనర్ సీపీ చౌహాన్ తన కార్యాలయంలో అభినందించారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్ల తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



దళిత బంధు లబ్ధిదారుని మెడికల్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం లబ్ధిదారుడు భీమనపల్లి రమేశ్ నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ షాపును సోమవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, నాయకులు చింతల రవి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారులనూ ఆధునీకరిస్తాం

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలు, బస్తీల్లోని అంతర్గత రహదారులు సైతం ఆధునీకరిస్తామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఐఎస్‌సదన్‌లోని విష్ణునగర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రణాళికాబద్ధంగా డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో వాటర్‌వర్క్స్, సెవరేజ్ సంబంధిత అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఆయా ప్రాంతాల్లో పనులు పూర్తయిన వెంటనే అక్కడి రహదారులను ఆధునీకరిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, భిక్షపతియాదవ్, కృష్ణయాదవ్, ప్రకాష్, డాక్టర్ జగన్, సతీష్‌యాదవ్, శివగౌడ్ పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన కార్పొరేటర్ శ్వేత

ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న వారిపై కేసు

కాచిగూడ: ఉద్దేశపూర్వకంగా ఇంటి నిర్మాణ పనులను అడ్డుకున్న వ్యక్తితో పాటు అతడికి సహకరించిన కుటుంబ సభ్యులపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. అడ్మిన్ ఎస్సై రవికుమార్ కథనం ప్రకారం.. కాచిగూడలో లక్ష్మీ (50) తన ఇంటి నిర్మాణానికి జీహెచ్ఎంసీ నుంచి అన్ని అనుమతులు తీసుకుని ఇంటిని నిర్మిస్తుండగా.. ఇంటి పక్కన ఉండే మల్లికార్జున్‌తో పాటు అతని కుటుంబ సభ్యులు ఆ ఇంటి నిర్మాణంతో తమకు ఇబ్బంది కలుగుతుందని ఆ ఇంటి నిర్మాణ పనులను ఉద్దేశ పూర్వకంగా అడ్డుకున్నారని సమాచారం. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరగగా.. లక్ష్మీ కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అడ్డుకున్న వ్యక్తితో పాటు అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.